మోసపోతున్నా...
మార్పు రాదా!
- జోరుగా ప్రైవేటు చీటీల వ్యాపారం
- రూ.లక్షల్లో వసూళ్లు చేసి.. నిర్వాహకులు పరారీ
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- ఆధారాలు లేక.. తలలు పట్టుకుంటున్న పోలీసులు

7

వైవీయూ వీసీగా ఫణితి ప్రకాశ్ బాబు



కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య ఫణితి ప్రకాశ్ బాబు నియమితులయ్యారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ అయిన ఈయనను వైవీయూ వీసీగా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి మంగళవారం జీవో విడుదల చేసింది.

విధులు ఇలా

ఫణితి ప్రకాశ్‌బాబు 1987-1992 వరకు హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, రీసెర్చ్ ఫెలోగా పరిశోధన పూర్తిచేశారు. 1992-1996 వరకు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ లెక్చరర్‌గా పనిచేశారు. 1996-2000 వరకు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ యానిమల్ సైన్సెస్ లెక్చరర్‌గా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (2006), ఏపీ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (2010), ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరోసైన్సెస్ లక్నో (2008) ఫెలోగా పనిచేశారు. 2001-2006 వరకు యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ యానిమల్ సైన్సెస్ రీడర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత ఇదే శాఖలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరు పలు ప్రతిష్ఠాత్మకమైన సంస్థలకు నేతృత్వం వహించారు. పలు ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు, ఫెలోషిప్‌లు అందుకున్నారు.. వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల విద్యార్థులకు ముఖ్యంగా వెనుకబడిన వారికి శిక్షణ ఇవ్వడం, సమాజంలోని అట్టడుగు స్థాయిలో, ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులలో శాస్త్రీయ జ్ఞానాన్ని పెపొందించడంలో కృషిచేశారు. 150 కంటే ఎక్కువ జాతీయ, అంతర్జాతీయ సమావేశాలలో పరిశోధన పత్రాలు సమర్పించారు. జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన అనేక సమావేశాలను నిర్వహించారు. కాగా.. కొద్ది నెలలుగా వైవీయూకు ఇన్‌చార్జి వీసీగా కృష్ణారెడ్డి కొనసాగున్నారు. ఫణిత ప్రకాశ్ బాబు త్వరలో యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా తవ్వకాలు జరిపి ఐదేళ్లపాటు ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున దోపిడీ సాగించారు. వైసీపీ దోపిడీ దౌర్జన్యాలకు రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయి కూటమి సర్కార్‌కు అధికారం కట్టబెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది తిరగకముందే వైసీపీకి ఏమాత్రం తీసిపోని రీతిలో ఇసుక, గ్రావెల్ దోపిడీ సాగిస్తున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో ఈ దందా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ ఎమ్మెల్యేలకు స్పష్టంగా మార్గనిర్దేశాలు చేసి ఇసుక, గ్రావెల్ అక్రమ తరలింపుతో పాటు భూకబ్జాలకు పాల్పడరాదని హితవు చెప్పినా అవేమి టీడీపీ ప్రజా ప్రతినిధుల చెవికెక్కినట్లు లేదు.

కూటమి సర్కారులోనూ.. కొల్లగొడుతున్నారు..!



అక్రమంగా గ్రావెల్‌ను టిప్పర్లకు నింపుతున్న ఎక్స్‌కవేటర్లు

- దువ్వూరు కేంద్రంగా గ్రావెల్ దోపిడీ
- ప్రభుత్వ సంపద లూటీ చేస్తున్న మాఫియా
- ఎక్స్‌కవేటర్లతో టిప్పర్లకు నింపి తరలిస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ మైనింగ్ అధికారులు



అక్రమ తవ్వకాలతో ఎకరాలకొద్దీ ఏర్పడిన గోతులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు దువ్వూరు మండలం అడ్డాగా మారింది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టానుసారం గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. వంద కాదు... రెండువందలు కాదు... అనుమతులు లేకుండా వేలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలు జరిపి రోడ్డు కాంట్రాక్టు పనులకు తరలిస్తున్నారు. విలువైన ప్రభుత్వ సంపదకు తూట్లు పొడుస్తున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడులకు, వారిచ్చే నోట్లకట్టలకు తలొగ్గి రెవెన్యూ, మైనింగ్ అధికారులు చోద్యం చూస్తుండడంతో ప్రభుత్వ సంపదను భారీగా కొల్లగొడుతున్నారు.

హైవే రోడ్డు పనులతో..

వైసీపీ హయాంలో చేపట్టిన తవ్వకాలతో ఇప్పటికే ఎకరాల కొద్ది గ్రావెల్ ఖాళీ అయింది. ప్రస్తుతం రాష్ట్రంలో పెద్ద కాంట్రాక్టు సంస్థ పని దక్కించుకుని మైదుకూరు వద్ద హైవే రోడ్డు పనులు మొదలు పెట్టింది. మైదుకూరు ప్రాంతంలో జరుగుతున్న ఈ పనిని జిల్లా పరిధిలోని ఒక అధికారపార్టీ నాయకుడు సబ్‌కాంట్రాక్టు తీసుకుని చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధికి ఈ గ్రావెల్ అక్రమ తవ్వకాల గురించి తెలిసినా ఆయన పట్టించుకోకపోగా అధికారులకు సైతం తనదైన పద్ధతిలో హింట్‌లు ఇచ్చినట్లు సమాచారం. దీంతో అక్కడ జరుగుతున్న గ్రావెల్ మైనింగ్ తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్నా వారెవరూ అటువైపు తొంగి చూడ్డం లేదని ఆరోపణలున్నాయి. దీంతో వందల కొద్దీ టిప్పర్లతో గ్రావెల్‌ను రాత్రింబవళ్లు అక్రమంగా పెద్దఎత్తున తరలిస్తున్నారు.

ప్రభుత్వ సంపద లూటీ దువ్వూరు పరిధిలో ఉన్న గుట్టలు కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారాయి. ఈ ప్రాంతంలో కాంట్రాక్టు పనులకు నాణ్యమైన గ్రావెల్ పుష్కలంగా లభిస్తుండడంతో అందరి దృష్టి ఈవైపు మళ్లింది. ప్రస్తుతం ఓ పెద్ద సంస్థ కాంట్రాక్టు పని దక్కించుకోగా ఈ పనిని సబ్‌కాంట్రాక్టర్లు చేస్తున్నారు. సదరు గ్రావెల్ క్రీస్తురాజపురం వద్ద నుంచి గుట్టలు దాటుకుని వెళితే ఎడమవైపు పుష్కలంగా లభిస్తుంది. ఇక్కడ సర్వే నంబరు 140లో ఎటువంటి అనుమతులు లేకుండా పెద్ద పెద్ద ఎక్సకవేటర్లతో టిప్పర్లకు లోడ్ చేసి తరలిస్తున్నారు. సర్వే నంబరు 140తో పాటు ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లో సుమారు 25 ఎకరాల్లో ఈ అక్రమ తవ్వకాలు కొనసాగిస్తున్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్న రీతిలో ఇక్కడ పరిస్థితి తయారైంది. ఎవరి మార్గంలో వారు అక్రమాలు కొనసాగిస్తున్నారు. ఇంత యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా, టిప్పర్లలో తరలుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖ వారు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై జిల్లా ఉన్నతాధికారులైనా స్పందిస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.



గ్రావెల్ నింపుకుని వెళుతున్న టిప్పర్లు

అనుమతులు లేవు

అనధికారికంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టడం చట్టవిరుద్ధం. అలా చేస్తుంటే పరిశీలిస్తాం. మా నుంచి గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. మేము సిఫారసు చేయలేదు. తవ్వకాలు జరిగే ప్రాంతం డీకేటీ భూమినా, ప్రభుత్వ భూమినా అనే విషయం క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంది.

- అక్బల్‌బాషు, తహశీల్దారు, దువ్వూరు

వికసిత భారత్ లక్ష్యాలను అధిగమించాలి

- 20 సూత్రాల రాష్ట్ర చైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్, చిత్రంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, సుధాకర్‌యాదవ్, వరదరాజులరెడ్డి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): వికసిత భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో 20 సూత్రాల కార్యక్రమాన్ని పటిష్ఠంగా నిర్వహించాలని రాష్ట్ర 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో కలెక్టర్ శ్రీధర్‌తో కలసి ప్రజాప్రతినిధులు, అధికారులతో 20 సూత్రాల చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర పథకాలు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలలో జిల్లాలో జరిగిన పురోగతిపై సమీక్షించామన్నారు. వికసిత భారత్, స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో చేపడుతున్న కార్యక్రమాల అమలుతీరుపై సమీక్షించామన్నారు. ఉపాధి హామీ, జల్‌జీవన్ మిషన్, అమృత్ పథకం, పీఎం ఆవాస్ యోజన, టిడ్కో గృహాలు, పీఎం సూర్య ఘర్ పథకం, పీఎం కుసుమ్, వ్యవసాయానికి విద్యుత్, యూరియా సబ్సిడీ, జాతీయ ఆహార భద్రత, గరీబ్ కళ్యాణ పథకాల అమలుపై సమగ్రంగా చర్చించామన్నారు.

అనంతరం లంకా దినకర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా ఉద్యాన పంటల సాగుకు అపారమైన వసరులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా గత ఐదేళ్లలో చేపట్టిన పనులకు, సిమెంట్ కొనుగోలుపై పక్కాగా సోషల్ ఆడిట్ నిర్వహించాలన్నారు. తాజాగా ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఫిబ్రవరి 2024 వరకు ఉత్తమ పనితీరు కనబరిచినందుకు జిల్లాకు రూ.3 కోట్ల నగదు పురస్కారాన్ని నీతి అయోగ్ ప్రకటించిందన్నారు. గతంలో కూడా జల్‌శక్తి అభియాన్ కింద క్యాచ్‌ది రైన్-2022 అమలులో భాగంగా జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాల ఫలితంగా భూగర్భ జలాల శాతం ఆశించిన స్థాయి కంటే అధికంగా ఉందన్నారు. జిల్లా అటవీశాఖ, నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న టీమ్ వర్క్ సత్ఫలితాలను ఇస్తోందన్నారు. జల్‌శక్తి అభియాన్‌లో జాతీయ స్థాయిలో 2020నాటికి కడప జిల్లాకు ద్వితీయ స్థానం దక్కిందన్నారు. అన్ని అంశాల్లో కూడా జాతీయ స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో సాగుతోందన్నారు.

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పంటలకు విపరీతంగా పురుగుల మందు వాడుతున్నారని అన్నారు. టిడ్కో గృహాలను కూలదోసి సిమెంట్ స్టాకును దోచుకున్నారని దానిపై విచారణ చేపట్టాలన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ కాంక్రీట్ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని మరమ్మతులు చేపట్టాలన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఆర్థికాభివృద్ధిలో పరిశ్రమలు, పర్యాటకం ప్రధాన భూమిక పోషించాయన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అత్యవసర విభాగంపై అలుసేల?

- రిమ్స్ క్యాజువాలిటీలో కష్టాలు
- రోగుల తాకిడికి సరిపడా లేని పడకలు
- అరకొర వసతులతో నెట్టుకొస్తున్న వైద్య సిబ్బంది

కడప సెవెన్‌రోడ్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మనిషికి గుండె ఎంత ముఖ్యమో.. ఏ ఆసుపత్రికైనా అత్యవసర విభాగం అలాంటిదని చెప్పవచ్చు. ఏదైన అనుకోని విపత్తు సంభవించినా, ప్రమాదాలు జరిగినా, రోగి మొదటగా వెళ్లేది అత్యవసర విభాగానికే. గొడవలో గాయపడినా, ప్రమాదాల్లో దెబ్బలు తగిలినా, అగ్నిప్రమాదాలలో కాలినా, చివరకు ఆత్మహత్యకు ప్రయత్నించినా, విషాన్ని సేవించినా మొట్టమొదట వేగంగా చికిత్సను అందించి ప్రాణం పోకుండా నిలిపేది అత్యవసర విభాగం అయిన క్యాజువాలిటీనే. అలాంటి క్యాజువాలిటీ చాలీచాలని పడకలతో పాత కాలం నాటి పరికరాలతో అవస్థలు పడుతోంది. కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) క్యాజువాలిటీలో మెరుగైన వసతుల కోసం ఇటు రోగులు, అటు వైద్యులు వైద్య సిబ్బంది ఎదురుచూస్తున్నారు. పూర్తిస్థాయి ఆధునిక వైద్య పరికరాలతో, మరిన్ని పడకలతో, విశాలమైన అత్యవసర విభాగపు చికిత్సలకై నిరీక్షిస్తున్నారు. రోగుల ప్రాణాలు నిలబెట్టేందుకు అరకొర వసతులున్న వాటితోనే వైద్య సిబ్బంది ప్రయత్నిస్తున్నారు.

ఎప్పుడో 2006లో ఆసుపత్రిని ప్రారంభించినపుడు 20పడకలతో ఏర్పాటు చేసిన అత్యవసర విభాగమే నేటికీ కొనసాగుతోంది. అనధికారికంగా మరో ఐదు పడకలను ఆసుపత్రి అధికారులు ఏర్పాటుచేసి వైద్యం అందిస్తున్నారు. గతంతో పోలిస్తే ప్రమాదాలు అధికమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి క్యాజువాలిటీకి వచ్చే రోగుల సంఖ్య కూడా అధికమైంది. రోగుల తాకిడికి తగ్గట్లు పడకల సామర్థ్యం పెంచకుండా అలానే వైద్య సేవలు అందిస్తున్నారు.



50 పడకలు అవసరం

రోగుల సంఖ్యను బట్టి అత్యవసర విభాగంలో దాదాపు 50పడకలు అవసరం. మెడికల్, సర్జికల్ ఎమెర్జెన్సీ, ట్రామాకేర్ అంటూ విడివిడిగా పడకలు ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా విభాగాలు ఏర్పాటుచేయాలి. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మాత్రం అన్ని విభాగాలకు కలిపి కేవలం 20+5 పడకలతో అందరికీ ఒకే చోట చికిత్స చేస్తున్నారు. ఒక్కోసారి పడకలు లేక అందరికి సర్దుబాటు చేయలేక, రోగులకు సరైన వైద్యం అందివ్వలేక వైద్యులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి సమయాల్లో ఒక్కోసారి రోగుల ప్రాణాలకూ భద్రత ఉండటం లేదు.

వైద్యులపై ఆరోపణలు

ఆసుపత్రిలో మిగతా విభాగాలలో వైద్యులు సమయపాలన పాటించకుండా కాస్తోకూస్తో నెట్టుకు రావచ్చు. కానీ అత్యవసర విభాగంలో వైద్యులు తప్పనిసరిగా ఉండాల్సిందే. అయితే ఇక్కడ సమయపాలన పాటించరని, అందుబాటులో ఉండరని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి డ్యూటీ సమయాల్లో కేవలం నర్సులు, వైద్య విద్యార్థులు మాత్రమే అందుబాటులో ఉంటారనేది బలమైన ఆరోపణ. సదరు విషయమై ఆసుపత్రి అధికారులు సైతం కొందరు వైద్యుల్ని మందలించిన సందర్భాలు ఉన్నాయి. ప్రాణం నిలబట్టే అత్యవసర విభాగంలో వైద్యులు, వైద్యపరికరాలు, మంచాలు లభ్యత పూర్తిస్థాయిలో ఉండేటట్లు అధికారులు చూడాలని రోగులు కోరుతున్నారు. క్యాజువాలిటీ కష్టాలెప్పుడు తీరేనో అంటున్నారు.



త్వరలోనే సమస్య తీరుతుంది



త్వరలోనే క్రిటికల్ కేర్ యూనిట్‌ను రోగులకు అందుబాటులోకి తెస్తాం. ఇది ఓపెన్ అయితే సమస్య చాలా వరకు తగ్గుముఖం పడుతుంది. వైద్యులు అందుబాటులో లేకుంటే, రోగులు ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. రోగుల సౌకర్యార్థం బెడ్స్ కొత్తవి మార్చాము. రోగులకు ఇబ్బంది లేకుండా వైద్యులు, వైద్య సిబ్బందిపై నిరంతర పర్యవేక్షణను సీసీ కెమెరాల ద్వారా చూస్తున్నాము.

- డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంఓ, సర్వజన ఆసుపత్రి, కడప

బాగా పండింది

- తమలపాకుల బుట్ట రూ.4వేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న తమలపాకు బుట్టలు



వేంపల్లెలో సాగులో ఉన్న తమలపాకు తోట

వేంపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అన్నీ సమపాళ్లలో కుదిరి తాంబూలం వేసుకున్న నోరు మాత్రమే కాదు.. ఆ తమలపాకులు సాగు చేస్తున్న రైతుల పంట కూడా పండింది. ఇటీవల ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుతం వంద కట్టల బుట్ట ధర రూ.4వేలు పలుకుతోంది. ఆకులను బట్టి రూ.3వేల నుంచి రూ.4వేల మధ్యలో ఈ ధర ఉంది. దీంతో రైతుల్లో సంతోషం నెలకొంది. చాలా ఏళ్లుగా తమలపాకు రైతుకు తీరని నష్టమే జరుగుతోంది. వేంపల్లె ప్రాంతలో సుమారు 150ఎకరాలలో తమలపాకు తోటలు సాగులో ఉన్నాయి. 90శాతం మంది రైతులు పొలాలను కౌలుకు తీసుకుని తోటలు సాగుచేస్తారు. ఎకరాకు రూ.80వేల నుంచి రూ.లక్ష దాకా కౌలు చెల్లిస్తారు. ఇంటిల్లిపాది తమలపాకుల సాగులో కష్టపడినా.. ఎప్పుడూ కుటుంబం గడిచేందుకే సరిపోయేది. ఒక్కోమారు నష్టం కూడా వచ్చేది. దీంతో తమలపాకు సాగుచేస్తున్న రైతు పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటోంది. ప్రస్తుతం తమలపాకులు కట్ట నాణ్యమైనవి రూ.4 వేల దాకా పలుకుతున్నాయి. ఇవి వేంపల్లె, చింతలమడుగుపల్లె, ఇడుపులపాయ చుట్టుపక్కల ప్రాంతాల్లో సాగులో ఉన్నాయి. త్వరలో రంజాన్ మాసం ఉంది. మళ్లీ ధర తగ్గే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలు మాత్రం రైతులకు కొంత ఊరటనిస్తున్నాయి.

మదనపల్లె సబ్‌కలెక్టరేట్ నేడు పునఃప్రారంభం

- హాజరుకానున్న రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్‌కలెక్టరేట్ బుధవారం పునఃప్రారంభం కానున్నట్లు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. గత ఏడాది జూలై 21వ తేదీ రాత్రి మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం జరిగిన తరువాత సీఐడీ కేసులు, విచారణ, ఆర్అండ్‌బీ అధికారులచే మరమ్మతుల అంచనాలు వెరసి మదనపల్లె సబ్‌కలెక్టరేట్ తిరిగి పాలనకు సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఏడు నెలల తరువాత సబ్‌కలెక్టరేట్‌ను పునఃప్రా రంభించేందుకు రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.పి.సిసోడియా, కలెక్టర్ శ్రీధర్ చామకూరి బుధవారం మదనపల్లెకు రానున్నట్లు సబ్‌కలెక్టర్ తెలిపారు. ఏడు నెలలుగా సబ్‌కలెక్టరేట్ ఆవరణంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయం నుంచే పాలన కొనసాగించారు. ఎట్టకేలకు కోర్టు హాలు, సబ్‌కలెక్టర్ చాంబర్, పరిపాలన భవనాలు సిద్ధం కాగా నేడు పునఃప్రారంభం కానున్నాయి.

గండికోటను సందర్శించిన
పర్యాటకశాఖ కార్యదర్శి
7

నీలం మామిడిలో..
కానరాని పూత
- ఆందోళనలో రైతులు


6

నీలం మామిడిలో.. కానరాని పూత

- పూత కోసం ముమ్మరంగా క్రిమిసంహారక మందులు పిచికారీ
- ఆందోళనలో రైతులు

పెనగలూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఈ యేడు మామిడి తోటల్లో ఆలస్యంగా పూత వస్తోంది. ఈ పాటికి బేనీషా, అంటిమామిడి, పోలూరు, ఖాదర్, మలుగుబ, ఇమామ్ పసంద్, ఢిల్లీ పసంద్, లడ్డూ పసంద్, గద్దమామిడి తదితర రకాల మామిడి చెట్లలో పూత బాగా వచ్చింది. అయితే నీలం రకం మామిడి చెట్లలో ఇంకా పూత రాలేదు. పూతకోసం రైతులు శరవేగంగా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. సాధారణ వాతావరణ పరిస్థితుల్లో అన్నిరకాల మామిడి చెట్లలో ఈ సమయానికి పిందెలు కనిపించాల్సి ఉండగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ఈ యేడాది అన్నిచోట్ల ఆలస్యంగా పూత వచ్చింది. అయితే నీలం చెట్లలో మాత్రం ఇంకా పూత రాలేదు. పూత కోసం రైతులు వ్యవసాయ మందులు, షాపుల వరకు పరుగులు తీస్తూ డీలర్లు చెప్పిన మందులను పిచికారీ చేస్తున్నారు. ఒకదఫా అయిపోయి రెండో దఫా కూడా మందులను పిచికారీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా మామిడి తోటల్లో ఫలరాజుగా గుర్తింపు కలిగిన బేనీషా పండ్ల తర్వాత అంతటి ఆదరణ కలిగిన కాయలు నీలం రకానికి చెందినవే. పలురకాల కాయలన్నీ జూన్ మాసానికంతటికి సీజన్ ముగిసిపోగా అప్పటికే కోతకు సిద్ధంగా ఉన్న నీలం మామిడికాయలు అంత త్వరగా చెడిపోవు. కాయలు పక్వానికి వచ్చినా ఒకటిన్నర నెలదాకా చెట్లపైన మాగకుండా అలాగే ఉండిపోతాయి. అందువల్ల మామిడి తోటలు సాగుచేసిన రైతులు 80 శాతం తోటలు, చెట్లు నీలం రకానికి చెందినవే ఉంటాయి. రైతులకు, వ్యాపారులకు మంచి లాభాలు తెచ్చి పెట్టే రకం కూడా నీలం కాయలే. నీలం కాయల కోత సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ముగింపు దాకా దాదాపు రెండు నెలల కూలీలకు చేతినిండా పని ఉంటుంది. ఈ సమయంలోనే కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు కూడా బాగా లాభాలు ఆర్జిస్తూ ఉంటారు. ఇతర రాష్ట్రాలు, దేశాలకు కూడా నీలంకాయలు బాగా ఎగుమతి అవుతూ ఉంటాయి. నీలం మామిడి పండు తినడానికి అన్నిరకాల మామిడి పండ్ల కంటే చాలా మధురంగా ఉంటుంది. పేద ప్రజలు కొనుగోలుకు కూడా నీలం, మామిడికాయల ధరలు అనుకూలంగా ఉంటాయి. అందువల్ల అన్నిరకాల ప్రజలు నీలం మామిడికాయలను తినేందుకు బాగా ఇష్టపడతారు. అయితే ఈ యేడు ప్రతికూల వాతావరణం పరిస్థితుల వల్ల ముందుగా పూత రావాల్సిన మామిడి చెట్లే ఆలస్యంగా వస్తున్నది. నీలం రకం మామిడి చెట్లు కూడా ఆలస్యమైనా సరే పూత వచ్చి బాగా కాయలు కాస్తాయని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు.



సింగనమల వద్ద పూత రాని నీలం రకం మామిడి తోట

పూత కోసం నీళ్లు కడుతున్నాం



నీలం చెట్లలో కూడా ఈ పాటికి పూత బాగా రావాల్సి ఉంది. చెట్లకు నీళ్లు కడితే వెంటనే పూత వస్తుందని నీళ్లు కడుతున్నాం. డిసెంబరు నెలాఖరు వరకు వర్షాలు బాగా కురిసి నేలలన్నీ పదునులోనే ఉన్నాయి. తోటలకు నీళ్లు కట్టినా కట్టకపోయినా ఆలస్యంగానైనా పూత వస్తుందన్న నమ్మకం ఉంది. ఈ యేడు ఎప్పుడు పూతకు రాని సంకరజాతి చెట్లు కూడా పూత వస్తున్నాయి. దాన్ని బట్టి నీలం చెట్లను అనుమానించాల్సిన అవసరం లేదు.

- కాలి వెంకటేశు, రైతు, కంబాలకుంట బీసీ కాలనీ, పెనగలూరు



తూర్పుపల్లెలో క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

నీలంలో కచ్చితంగా పూత వస్తుంది



సాధారణంగా ఎప్పుడైనా నీలం మామిడిలో పూత ఆలస్యంగానే వస్తుంది. ఈ యేడు అన్నిరకాల మామిడిలో పూత ఆలస్యంగా వచ్చింది. రైతులు చింతించాల్సిన అవసరం లేదు. నీలం మామిడి చెట్లలో కూడా ఈ పాటికి సన్నని మొగ్గ ఏర్పడుతోంది. ఇంకో పదిరోజులు దాటిన తర్వాత మొగ్గ బాగా కనిపిస్తుంది. ఇప్పటి వాతావరణానికి అనుగుణంగా రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

- సురేష్‌బాబు, ఉద్యానశాఖ అధికారి

భూకబ్జాలను అరికట్టండి

- కడప ఆర్డీవోను ఆదేశించిన జేసీ అదితిసింగ్



భూకబ్జాలను అరికట్టాలని ఆర్డీవోను ఆదేశిస్తున్న జేసీ

సిద్దవటం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లె మాధవరం-1 గ్రామ పంచాయతీల్లో భూ కబ్జాలను అరికట్టాలని కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్‌ను జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సులపై జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురు, శుక్రవారం జిల్లాలోని రెండు మండలాలు తనిఖీ చేసి సిబ్బంది పనితీరు పర్యవేక్షిస్తున్నామన్నారు. సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు, రీసర్వే, ఫిర్యాదుల పరిష్కారం, సిబ్బంది పనితీరుపై ఆరా తీశామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా సెక్రటరీగా శంకర్



సన్మానం అందుకుంటున్న జిల్లా విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీగా వలిగిరి శంకర్ నియమితులయ్యారు. నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా మంగళ వారం విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆయన రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్ శాస్త్రి చేతుల మీదుగా సన్మానం, సత్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వలిగిరి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గం తనపై ఉన్న నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు, సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

తిరుపతి నుంచి గల్ఫ్‌కు విమాన సర్వీసులు ప్రారంభించాలి

- కేంద్ర మంత్రికి కుడా చైర్మన్ ముక్కా వినతి



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న ముక్కా

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి గల్ఫ్‌కు విమాన సర్వీసులు ప్రారంభించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ చైర్మన్, కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి వినతిపత్రం అందజేశారు. మంగళవారం విజయవాడలోని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నివాసంలో ఆయనను, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటు రైల్వేకోడూరు నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది గల్ఫ్ దేశాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గల్ఫ్ నుంచి స్వదేశానికి చెన్నై విమానాశ్రయం నుంచి వస్తూ చాలా మంది ప్రమాదాలు జరిగి మరణిస్తున్నారని, తిరుపతి విమానాశ్రయం నుంచి గల్ఫ్‌కు సర్వీసులు ప్రారంభిస్తే జిల్లా ప్రజలకు అనువుగా ఉంటుందని తెలిపారు. కాగా త్వరలోనే గల్ఫ్‌కు విమాన సర్వీసులు ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

'మిషన్ వాత్సల్య'ను కట్టుదిట్టంగా అమలు చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని పిల్లల సంక్షేమమే ధ్యేయంగా కట్టుదిట్టంగా అమలు చేయాలని, జిల్లాలో బాల్యవివాహాలను రూపుమాపాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన, మిషన్ వాత్సల్య కార్యక్రమంపై జిల్లా స్థాయి బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి రమాదేవి ఈ సమావేశాన్ని ప్రారంభిస్తూ మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి శిశు సంక్షేమం, పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. అలాగే గ్రామ, వార్డు స్థాయిల్లో సర్పంచ్ అధ్యక్షతన పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామనాధ్‌హెగ్డే, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి రమాదేవి, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, మదనపల్లె, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లు, జీఎస్‌డబ్ల్యుఎస్, విద్య, వైద్య, సాంఘీక సంక్షేమ, వెనుకబడిన తరగతుల శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

రామాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ జగనన్న కాలనీ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు స్కూటర్లు ఢీకొని వెంకటసుబ్బరాయుడు, బండి వెంకటసుబ్బరాయుడు, శ్రీనివాసులకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఓబుల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన పై ముగ్గురు కూలి పనికోసం జగనన్న కాలనీకి స్కూటర్‌లో వెళ్తుండగా.. మార్గమధ్యంలో బండపల్లి పంచాయతీలోని జగనన్న కాలనీ సమీపానికి రాగానే కడప వైపు నుంచి రాయచోటి వైపు బైకులో వెళ్తున్న కడపకు చెందిన మౌలా వెనుక వైపు నుంచి ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ముందు వెళ్తున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేసుకొని గాయపడిన వారికి ప్రథమ చికిత్స కోసం రాయచోటి ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

భర్త వేధింపుల నుంచి రక్షణ కల్పించండి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన మదనపల్లె మహిళ



ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు పార్వతమ్మ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): 'నా భర్త నాకు కాలయముడిగా తయారయ్యాడని, అతని వేధింపుల నుంచి నాకు రక్షణ కల్పించాలంటూ' జిల్లా పరిధిలోని మదనపల్లె పట్టణం పెంచిపాడులో నివాసముంటున్న పి.భాస్కర్ భార్య పి.పార్వతమ్మ సోమవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వివరాల్లోకి వెళితే.. మదనపల్లె పట్టణం పెంచిపాడుకు చెందిన భాస్కర్‌తో 23 సంవత్సరాల క్రితం పార్వతమ్మకు వివాహమైంది. అప్పటి నుంచి అన్యోన్యంగా ఉన్న భార్యభర్తల మధ్య గత ఆరేళ్లుగా గొడవలు మొదలయ్యాయి. పార్వతమ్మ భర్త భాస్కర్ మదనపల్లె పట్టణంలోని ఎస్టేట్‌లో ఉన్న గార్మెంట్‌లో మేనేజర్‌గా పని చేస్తూ అక్కడే పనిచేస్తున్న ఓ మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని ప్రతిరోజు పార్వతమ్మను చిత్రహింసలకు గురిచేస్తుండేవాడని తెలిపింది. ఈ నేపథ్యంలోనే తనపై పలుమార్లు దాడి చేసి బెల్టుతో, చెప్పులతో కొడుతూ చంపేందుకు ప్రయత్నం చేస్తూ తనను ఇంటి నుంచి పుట్టింటికి తరిమేశాడని ఫిర్యాదులో వివరించారు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, తమ కుటుంబ బాగోగులు చూడకుండా తన భర్త భాస్కర్ తనను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు కట్నం మరో రూ.10 లక్షలు తీసుకురావాలని చిత్రహింసలకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్తతో పాటు అతనితో వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళతో తనకు ప్రాణహాని ఉందని, వారి భారి నుంచి రక్షణ కల్పించాలంటూ పార్వతమ్మ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. బాధితురాలు వెంట ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మల్లికార్జున, శ్రీరాములు, రామప్ప, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- మాజీ సీఎం నల్లారి కిరణ్‌కు వినతి



కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ వాల్మీకి సంఘం నాయకులు మంగళవారం కలికిరిలో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాల్మీకి సేవా సమితి వాల్మీకిపురం మండల అధ్యక్షుడు విష్ణుచైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలోని వాల్మీకుల పరిస్థితిని గమనించి, వారిని ఎస్టీ జాబితాలోకి చేర్చే విధంగా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన మాట్లాడుతూ వాల్మీకులకు న్యాయం జరిగేలా, వాల్మీకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గంగులప్ప, రాజేంద్రప్రసాద్, గణి, బాలు, భరత్, రామకృష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ సుబ్రమణ్యం, ఉపవిద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, కోర్స్ కోఆర్డినేటర్, ఎంఈఓలు బాలాజీనాయక్, వెంకటశివారెడ్డి, ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీఆర్పీలు హాజరయ్యారు. ఈ శిక్షణను ఉద్దేశించి డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాథమిక దశలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందింపచేస్తే ఉన్నత దశలలో సంపూర్ణ అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. అనంతరం ఉప విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జ్ఞానజ్యోతి కార్యక్రమం ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం కోర్సు కోఆర్డినేటర్, ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమిక దశలో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంపొందించాలన్నా, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలన్నా పునాది అభ్యసనం అంగన్వాడీ కార్యకర్తలుగా మీకు మీరేసాటి అంటూ కార్యక్రమం సారాంశాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీలు రాజారమేశ్, వెంకటసుబ్బయ్య, సికిందర్, నాగమణి, సుగుణ, శివజ్యోతి, ఎఫ్ఎల్ఎన్ కోఆర్డినేటర్ రాజశేఖర్, సీఆర్పీలు అరుణ్ బాబు, రవిప్రకాశ్ పాల్గొన్నారు.

రూ.5.51 లక్షలకు తలనీలాల వేలం

సిద్దవటం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిత్యపూజస్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాలు సేకరించుకునే హక్కులను అద్దంకి గ్రామానికి చెందిన మహేంద్ర రూ.5.51 లక్షలకు దక్కించుకున్నారని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించి వేలంపాటను నిర్వహించారు. గతేడాది ఈ హక్కుల ద్వారా రూ.5.85 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ.34 వేలు తగ్గింది. ఈ కార్యక్రమంలో రాజంపేట దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ కమిటీ చైర్మన్, సిబ్బంది చంద్ర, వంతాటిపల్లె గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న ఎండోమెంట్ అధికారులు

ఉద్యోగ భద్రత కల్పించండి

- సీఎం చంద్రబాబుకు వైద్యమిత్రల వినతి
- నల్లరిబ్బన్లతో విధులకు హాజరు




నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న వైద్య మిత్రలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని వేతనాలతో 17 ఏళ్లుగా పనిచేస్తున్నాం. కుటుంబ పోషణ జరగక, పిల్లలను సక్రమంగా చదివించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. తమకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న వైద్యమిత్రలు, టీం లీడర్లు, ఆఫీసు అసోసియేట్లు, జిల్లా మేనేజర్లు సీఎం చంద్రబాబునాయుడును వేడుకొంటున్నారు. మంగళవారం వారు జిల్లా వ్యాప్తంగా నల్లరిబ్బన్లు తగిలించుకొని విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చిత్తశుద్ధితో, సేవాభావంతో ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. ఎందరో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రబాబు తమ జీవితాల్లో కూడా వెలుగులు నింపాలని వారు అభ్యర్థించారు. ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకాన్ని ఇన్సూరెన్స్ మోడ్‌లోకి బదలాయింపు చేసిన పథకంలో పనిచేస్తున్న వైద్య మిత్రలు, టీం లీడర్లు, ఆఫీసు అసోషియేట్లు, జిల్లా మేనేజర్ తదితర క్షేత్ర స్థాయి సిబ్బంది ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ముఖ్యమంత్రికి విన్నవించారు.

అగ్ని ప్రమాదంలో రైతుకు అపార నష్టం

- చేతికందిన మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి
- రూ.4 లక్షలకు పైగా నష్టం
- ట్రాన్స్‌ఫార్మర్, మోటర్, కేబుల్ వైర్లు బుగ్గిపాలు

పెద్దతిప్పసముద్రం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు భూమిని లీజుకు తీసుకుని అప్పు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన మొక్కజొన్న పంట అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో ఆ రైతుకు భారీ నష్టం వాటిల్లింది. చేతికందిన పంట అగ్నికి ఆహుతి కావడంతో ఆ రైతు కుటుంబం కన్నీటి పర్యంతమైంది. స్థానికుల కథనం మేరకు పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ నరసింహులు తనకు భూమి తక్కువగా ఉండడంతో ఆరు ఎకరాల భూమిని లీజుకు తీసుకుని అందులో నాలుగెకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. పంట కూడా బాగా ఏపుగా పెరిగింది. దీంతో ఒకటి రెండు రోజుల్లో పంట కోద్దామని అనుకున్నారు. అయితే మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో పొలం వద్ద నిప్పు పడేసినట్లు సమాచారం. అది కాస్త పంటకు వ్యాపించడంతో పంట అగ్నికి ఆహుతైంది. సమాచారాన్ని పరిసర ప్రాంత రైతులు నరసింహులుకు తెలియజేయడంతో ఆయన అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించి మంటలను ఆర్పేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. అయితే బాగా పండిన పంట కావడంతో మంటలు అదుపులోకి రాక రెండు ఎకరాలకు పైగా పంట పూర్తిగా కాలిపోయింది. పంటతో పాటుగా ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్ వైర్లు, బోరు మోటర్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో దాదాపు రూ.4 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతు నరసింహులు కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ప్రభుత్వం స్పందించి ఆ రైతును ఆదుకోవాలని స్థానిక రైతులు ప్రభుత్వాన్ని కోరారు.



పూర్తిగా కాలిపోయిన మొక్కజొన్న పంట, కాలిపోయిన పైపులైన్, మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మోసపోతున్నా... మార్పు రాదా!

జనం సొమ్మునే పెట్టుబడిగా పెట్టి నిర్వహిస్తున్న ప్రైవేటు చీటీల వ్యాపారం జిల్లాలో మూడు పువ్వు లు ఆరుకాయలుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకపోయినా కొందరు ప్రైవేటుగా చీటీలు నిర్వహిస్తూ.. రూ.కోట్లలో డబ్బులు వసూళ్లు చేసి ఉన్నఫలంగా కుచ్చుటోపీ పెట్టి పరారవుతున్నారు. దీంతో లబోదిబోమంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అయితే వీరి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీ సులు తలలు పట్టుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా చీటీల వ్యాపారం షరా మామూలే అన్నట్లు సాగుతోంది.

- జోరుగా ప్రైవేటు చీటీల వ్యాపారం
- రూ.లక్షల్లో వసూళ్లు చేసి.. నిర్వాహకులు పరారీ
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- ఆధారాలు లేక... తలలు పట్టుకుంటున్న పోలీసులు



కడప క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):కడపతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అనుమతి లేని చీటీ లు ఎక్కువ నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. కడప నగరంలోని చిన్నచౌకు, మృత్యుంజయకుంట, ఓంశాంతినగర్, శంకరాపురం, అక్కాయపల్లె, ఐటీఐ సర్కిల్, నబీకోట, రాజారెడ్డివీధి, మాసాపేట, అంగడివీధి, శంకరాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు ఇలా ప్రతి ప్రాం తంలో వీధికొకరు చీటీలు నిర్వహిస్తున్నారు. అయితే తరచూ జిల్లాలో ఎక్కడో ఓ చోట నిర్వాహకులు రాత్రికి రాత్రే కుచ్చుటోపి పెట్టి పరారవుతన్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించి తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. అందులో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలను పరిశీలిస్తే..

కడప నగరంలోని అక్కాయపల్లెలో భార్యా భర్త చీటీలు వేసి రూ.కోట్లు వసూళ్లు చేసి ఆపై బోర్డు తిప్పి పరారీ అయ్యా రు. డబ్బు కట్టినట్లుగా బాధితుల వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. ఈ వ్యవహారంపై పలువురు తాలుకా పోలీసులను ఆశ్రయించడంతో దంపతులపై చీటింగ్ కేసు నమోదు చేసి ఇటీవల నిర్వాహకుడిని అరెస్టు చేశారు. కడప నగరం నాగరాజుపేటలో ఓ మహిళ రెండు నెలల క్రితం చీటీలు వేసి భారీ ఎత్తున సభ్యుల నుంచి డబ్బులు వసూళ్లు చేసుకుని పరారైంది. ఇదే ఏరియాలో మరో వ్యక్తి కోట్ల రూపాయలు చీటీలు వేసి చివరికి ఐపీ దాఖలు చేసి పరారయ్యాడు. కడప నగరంతో పాటు జిల్లాలో తరచూ ఇలాంటి మోసాలు బయటపడుతున్నాయి. అయితే బాధితులు దగ్గర సరైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు ఏం చేయాలో అర్థకంకాక తలలు పట్టుకుంటున్నారు.

అనుమతులు లేకుండా నిర్వహణ

ప్రైవేటు చీటీల వ్యాపారానికి ప్రభుత్వ అనుమతి లేకపోయినా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. నమ్మకమే పెట్టుబడిగా ఈ దందా సాగుతుండడంతో అటు అధికారులు, పోలీసులు కూడా వీటిని కట్టడి చేయలేకపోతున్నారు. ఇటీవల కడప తాలుకా పరిధిలో చీటీల వ్యాపారం చేసి బోర్డు తిప్పిన ఓ దంపతులకు కడప కోర్టు జైలు శిక్ష విధించడంతో పాటు జరిమానా కూడా విధించింది. అలాగే రాజారెడ్డివీధికి చెందిన మరో ఇరువురికి కూడా కోర్టులో శిక్ష పడింది. అయినా కొందరిలో మార్పు కనిపించడంలేదు. ముఖ్యంగా ఈ చీటీల ఉచ్చులో మహిళలే ఇరుక్కుంటున్నారు. చట్టపరిధిలో అనుమతి పొందిన చీటీల్లోని సభ్యులకు కచ్చితంగా ఆర్థికపరమైన భద్రత ఉంటుంది. చట్టబద్ధత లేని చీటీ వ్యాపా రంతో ప్రజల జీవితాలు నాశనం అవుతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి మహిళలు చీటీల నిర్వాహకుల ఉచ్చులో పడి మోసపోతున్నారు.

చీటీల వ్యాపారుల మాటలు నమ్మి మోసపోవద్దు

ఎవరూ కూడా ప్రైవేటు చీటీలు వేసి మోసపోవద్దు. ముఖ్యంగా ప్రైవేటు చీటీలపై మహిళలే డబ్బులు చెల్లిస్తూ ఉన్నారు. చట్టబద్ధత ఉన్న వాటిల్లోనే డబ్బులు కట్టాలి. ఈ ప్రైవేటు చీటీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

-వెంకటేశ్వర్లు, కడప డీఎస్పీ

గండికోటను సందర్శించిన రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి



గండికోటలో ధాన్యాగారాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్, కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటను మంగళవారం రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఇతర అధికారులు సందర్శించారు. ముందుగా వారు గండికోటలోని ఏపీ టూరిజం హోటల్ వద్ద పరిశీలించారు. గతంలో ఆగిపోయిన రోప్‌వే పిల్లర్స్‌ను, లోయ పక్కనే అనుమతి లేకుండా వేసిన టెంట్లను పరిశీలించారు. అనంతరం గండికోటలోని ధాన్యాగారాన్ని, రంగనాథస్వామి, మాధవరాయస్వామి ఆలయాలను సందర్శించారు. పర్యాటక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఒబెరాయ్ స్టార్‌హోటల్ నిర్మించే ప్రాంతాన్ని, గండికోట రిజర్వాయర్ బ్యాక్‌వాటర్, తదితర వాటికి సంబంధించి చర్చించారు. అడ్వెంచర్ ప్రాంతంలో చేపట్టే బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి పరిశీలించారు. ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి, టూరిజం అధికారి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగితీగ చోరీ చేసే దొంగల అరెస్టు



పట్టుబడ్డ దొంగలను చూపుతున్న పోలీసులు

చక్రాయపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగితీగను చోరీచేసే దొంగలను పోలీసులు అరెస్టు చేశా రు. పులివెందుల డీఎస్పీ, సీఐల ఆదేశాల మేరకు ట్రాన్స్‌ఫార్మర్‌ల దొంగలపై నిఘా పెట్టిన చక్రాయపేట ఎస్ఐ కృష్ణయ్య మంగళవారం ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వివరాల్లోకెళితే... చెన్నూరు మండలం రుద్రభారత్‌పేట శాటిలైట్ సిటీకి చెందిన ఇ.మల్లికార్జున, శంకర్‌లు గత కొన్ని రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగితీగను చోరీ చేసే వారు. ఈ నేపథ్యంలో చక్రాయపేట ఎస్ఐ తమ సిబ్బందితో గాలివీడు క్రాస్ వద్ద ఎస్ఐ తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటర్ బైకులో నాగులగుట్టపల్లె వైపు పరుగులు తీశా రు. వారిని వెంబడించి పట్టుకొని తమదైన శైలిలో విచారించగా చక్రాయపేట మండలంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగలించామని తెలిపారు. అలాగే జిల్లాలోని వేముల, వేంపల్లె, లింగాల, పెండ్లిమర్రి, పులివెందుల, చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు, ముద్దనూరు, ఖాజీపేట, రిమ్స్, జమ్మలమడుగు, మైలవరం, పెండ్లిమర్రి ప్రాంతాలలో 27 ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులగొట్టి వాటిలోని రాగివైర్లను దొంగలించామని ఒప్పుకున్నారు. ఈ మేరకు కడప ఎయిర్‌పోర్టు వద్ద కంపచెట్లలో దాచిన సుమారు 180 కేజీల రాగివైరు, ట్రాన్స్‌ఫార్మర్లను విప్పడానికి వాడే పరికరాలను, పల్సర్ బైకును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా చక్రాయపేట పోలీసులను డీఎస్పీ, సీఐలు అభినందించారు.

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యో తి): విద్యాశాఖ బలోపేతానికి పూర్వ ప్రాథమిక విద్య ప్రథమ ప్రాధాన్యత వహిస్తుందని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు సూచించారు. మంగళవారం కడప నగరం జయనగర్ కాలనీ నగరపాలక ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ వర్కర్స్ ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం జిల్లా సమగ్ర శిక్ష, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖకు అంగన్వాడీకి అనుసంధానంగా పనిచేయాలని.. అప్పుడే పూర్వ ప్రాథమిక విద్య నుంచి ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య, ఉన్నత విద్య బలోపేతం చెందుతాయన్నారు. కడప మండల విద్యాశాఖ అధికారి దుద్దికుంట గంగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పుల్లో భాగంగా న్యూ క్లస్టర్ విధానంలో బేసిక్ ప్రైమరీ స్కూళ్లకు అంగన్వాడీలను అనుసంధానం చేస్తూ పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ఈకార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా జ్ఞానజ్యో తి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కిరణ్ రథం, రీసోర్స్ పర్సన్ శోభారాణి, సూపర్‌వైజర్ ప్రశాంతిలు ప్రసంగించారు. కార్యక్రమంలో కడప నగరంలోని ఆరు సెక్టార్ల సూపర్‌వైజర్లు, రీసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కేఎస్‌ఆర్‌ఎం విద్యార్థుల మెగా విజయం



ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన విద్యార్థులతో కేఎస్ఆర్ఎం కళాశాల ఎండీ చంద్ర ఓబుళరెడ్డి (నాని) తదితరులు

సికెదిన్నె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రాంగణ ఎంపికల్లో కేఎస్‌ఆర్‌ఎం కళాశాల విద్యార్థులు మెగా విజయాన్ని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. స్థానిక కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మెయిల్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 80 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో 52 మంది సివిల్ విద్యార్థులు, 13 మంది మెకానికల్ విద్యార్థులు, 15 మంది ఈఈఈ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి ట్రైనింగ్ కాలంలో 2.3 లక్షలు వార్షిక వేతనం అందిస్తారని, ట్రైనింగ్ పూర్తయినవారికి రూ.5లక్షలు వేతనం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల కళాశాల ఎండీ చంద్ర ఓబుళరెడ్డి (నాని) మాట్లాడుతూ మెయిల్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు వృత్తినైపుణ్యాన్ని ప్రదర్శించి విజయం సాధించినందుకు అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ, వైస్‌చైర్మన్ మదనమోహన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు విద్యార్థులను అభినందించారు.

భారతీయ సంస్కృతికి నిదర్శనం రామాయణం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైవీయూ ఇన్‌చార్జి వీసీ క్రిష్ణారెడ్డి

కడప కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి నిలువెత్తునిదర్శనం రామాయణం అని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ఆచార్య కె.క్రిష్ణారెడ్డి అన్నారు. రాముని గుడి అంటూ లేని గ్రామం మన భారతదేశంలో ఉండదన్నారు. వైవీయూ ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రంలో రామాయణం, సామాజిక దృక్పథం అనే అంశంపై జరుగతున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో భాగంగా మంగళవారం ఉదయం ప్రారంభ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిధిగా ఆచార్య క్రిష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. రామాయణంలోని ప్రతిపాత్ర నాటికి నేటికీ రేపటికి కూడా గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు.సభకు అధ్యక్షత వహించిన ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎం.సంపత్‌కుమార్ మాట్లాడుతూ రామాయణ కావ్యాన్ని ఆధ్యాత్మిక గ్రంథంగా కాకుండా ఆధునిక సమాజానికి ఉపకరించే తీరును సదస్సు ద్వారా తెలియజెప్పాలనే లక్ష్యంతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి, ఆచార్య మలయవాసిని, స్వామి తురియానంద, భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, డాక్టర్ చింతకంట శివారెడ్డి, వైవీయూ అధ్యాపకులు ఆచార్య ఎంఎం వినోదిని, రాంప్రసాద్‌రెడ్డి, ఆచార్య ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బోలేరో క్యాంపర్ ఢీ.. 14 గొర్రెలు మృతి



కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై మృతి చెందిన గొర్రెలు

కొండాపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్లూరు గ్రామం వద్ద మంగళవారం బొలెరో క్యాంపర్ వాహనం ఢీకొనడంతో 14 గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని చౌటిపల్లె గ్రామానికి చెందిన పుల్లగూర సుబ్బారెడ్డి అనే రైతు కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై గొర్రెలను మేపు కోసం తీసుకెళుతుండగా ఆదోనికి వంటనూనె లోడుతో వెళుతున్న బొలెరో క్యాంపర్ వేగంగా గొర్రెలమందను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని తెలిపారు. తనకు జీవనధారమైన గొర్రెలు మృతి చెందడంతో బోరున విలపిస్తున్నాడు. ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య



కడప(క్రైం), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వైఎస్ఆర్ కాలనీకి చెందిన సుచిత్ర (15) అనే విద్యార్థిని మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమ యంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న దేవ కుమార్, ప్రభావతిల కుమార్తె సుచిత్ర మున్సిపల్ మెయిన్ స్కూల్‌లో పదో తరగతి చదువుకుంటుంది. సుచిత్ర అనారోగ్యంతో సరిగా స్కూల్‌కు వెళ్లేదికాదు. ఈక్రమంలో హాజరు సరిగా లేకపోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో కలతచెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి టిప్పర్ దగ్ధం

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నదండ్లూరు గ్రామం వద్ద విద్యుత్ వైర్లు తగిలి టిప్పర్ దగ్ధమైంది. చిన్నదండ్లూరు గ్రామానికి నిర్మిస్తున్న రోడ్డుకు టిప్పర్ ద్వారా మట్టిని తోలుతున్నారు. టిప్పర్ అన్‌లోడ్ చేసే సమయంలో విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. ఫైర్ ఇంజిన్ వచ్చి ఆపేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాగా, విద్యుత్‌షాక్‌కు గురైన డ్రైవర్ భయపడి కిందకు దూకడంతో గాయపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

సికెదిన్నె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం జె.నారాయణపురంలో మంగళవారం రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌తో కలిసి సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల సర్వే 3.0ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వ్యాధుల బారిన పడటానికి అవకాశం గల వ్యక్తులను గుర్తించడానికి పరీక్షలు జరపాలన్నారు. అనుమానితులను నిపుణులైన వైద్యుల వద్దకు పంపితే నిర్ధారించడం జరుగుతుందన్నారు. పై వ్యాధులను గుర్తించడానికే సర్వే జరుగుతుందని, దేశవ్యాప్తంగా జరిగే ఈ సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా సర్వేలో లక్ష్యాలు చేరుకోని దాదాపు 17 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి రాఘవేంద్ర, జనార్ధన్, జయరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి బంగారు హారం బహూకరణ



ఆంజనేయస్వామికి బంగారు హారం అందజేస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామికి భక్తులు రూ.14 లక్షలు విలువైన 153 గ్రాముల రామ్‌పరివార్ బంగారు హారాన్ని అందజేశారు. వెదుర్ల బజారుకు చెందిన సాయిప్రసాద్ తన సతీమణి అమ్మణ్ణి జ్ఞాపకార్థం స్వామివారికి బంగారు హారం తయారు చేయించారు. మంగళవారం వారి కుమారుడు కిరణ్, కోడలు సత్యలతలు ఆలయ చైర్మన్ సత్యనారాయణ, ఈవో రమణారెడ్డిలకు బంగారు హారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. హారాన్ని బహూకరించిన సాయిప్రసాద్ కుటుంబ సభ్యులకు ఆలయ చైర్మన్, ఈవోలు కృతజ్ఞతలు తెలిపారు.

చోరీయత్నం విఫలం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లెలో రేణుక ఎల్లమ్మ వీధిలోని ఓ ఇంట్లో మంగళవారం తెల్లవారు జామున దొంగలు చోరి చేయడానికి వెళ్లి విఫలం అయిన ఘటన వెలుగు చూసింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. రేణుక ఎల్లమ్మ వీధిలో భూమా రాజ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబం నివాసం ఉంటున్నారు. అతను బెంగుళూరులో ఉద్యోగం చేస్తూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళ్లేవారు. మంగళవారం తెల్లవారుజామున రాజా ఇంటి గేటు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాలు తెరిచే ప్రయత్న చేశారు. అవి తెరుచుకోకపోవడంతో దొంగలు తిరిగి వెళ్లిపోయారు. ఉదయాన్నే రాజ ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో గమనించిన బంధువులు అతనికి ఫోన్ చేసి విషయం తెలిపారు. దీంతో రాజా బెంగుళూరు నుంచి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ వెంకట సురేష్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగలు ఇంటిలోని బీరువాలు తెరవడానికి ప్రయత్నించి విఫలమైనట్లు గుర్తించారు. పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు.

22 నుంచి ప్రాజెక్టుల ప్రాంతీయ సదస్సు

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగే ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభ జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.80వేల కోట్ల అంచనా వ్యయంతో గోదావరి-బనకచర్ల ఎత్తిపోతల పథకం కేవలం కాంట్రాక్టర్ల కడుపునింపి తద్వారా ఎన్నికల నిధి పోగుచేసుకోవడానికి ఉపయోగపడుతుందని ఆరోపించారు. గతలో పోలవరం పూర్తయితే కృష్ణాడెల్టా ఆయకట్టు స్థిరీకరణ ద్వారా శ్రీశైలంలో కృష్ణాడెల్టాకున్న క్యారీ ఓవర్ నీళ్లను రాయలసీమ ప్రాజెక్టుకు వాడుకునే వెలుసుబాటు ఉంటుందని చెబుతూ వచ్చారన్నారు. కానీ నేడు కొత్త ప్రతిపాదనల పేరుతో రాయలసీమ ప్రజలను మభ్యపెడుతున్నారని వాపోయారు. పోలవరం పూర్తయితే పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి ప్రాధాన్యత ఉండదని తెలిసినా రూ.1600 కోట్లు ఖర్చు చేశారన్నారు. సీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు రూ.10 వేల కోట్లు కేటాయిస్తే ప్రాధాన్యత క్రమంలో పంట కాల్వల పూర్తి ద్వారా 10 లక్షల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి చెందుతుదన్నారు. సీమపట్ల, ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కడపలో జరిగే రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభకు ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, నీటిపారుదల రంగ నిపుణులు టి.లక్ష్మీనారాయణ, బొజ్జ దశరథరామిరెడ్డి, డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, 100 టీఎంసీ రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటశివ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వామపక్ష పార్టీల జిల్లా సదస్సు

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 20వ తేదీ గురువారం స్థానిక రామకృష్ణనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయం మీటింగ్ హాల్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా ఉమ్మడి సదస్సు నిర్వహించడానికి వామపక్షాల ఉమ్మడి సమావేశంలో నిర్ణయించినట్లు జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లాలోని వామపక్ష పార్టీ ఉమ్మడి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ 2025 బీజేపీ ప్రభుత్వ కేంద్ర బడ్జెట్‌ను, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ అణగారిన ప్రజల వ్యతిరేక పొలిటికల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్ న్యూడెమోక్రసీ), ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ఎస్‌పీ, సీపీఐ (ఎంఎల్ లేబరేషన్) పాల్గొన్నారు.

ఇక గ్రామాల్లోనే రెవెన్యూ పాలన

● ఆర్డీవో జాన్ ఇర్విన్


వల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరు ఆదేశాల మేరకు ఇక రెవెన్యూ పరిపాలన గ్రామాల్లో నిర్వహిస్తామని, తద్వారా రైతులకు అందుబాటులో ఉంటామని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన వల్లూరు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న తహసీల్దారు శ్రీవాణితో మాట్లాడి వల్లూరు రెవెన్యూకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. గత రెవెన్యూ గ్రామసభల్లో ఏవైనా అర్జీలు వచ్చి ఉంటే వాటిని పూర్తిగా పరిష్కరించారా లేదా అని అడిగారు. అక్కడున్న రైతులతో మాట్లాడారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ పరిపాలన ను గ్రామాల్లో నిర్వహిస్తామని, తద్వారా రైతులకు ప్ర జలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరి ష్కరించుకునేందుకు వీలుంటుందన్నారు. తహసీల్దారు ప్రతిరోజూ తమ మండల పరిధిలో ఏదో ఒక గ్రా మ సచివాలయం వద్దకు వెళ్లి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు అక్కడే ఉండి రైతుల నుంచి కానీ, ప్రజలనుంచి కానీ అర్జీలు స్వీకరించి వాటిని వీలైతే అప్పుడే పరిష్కరించాలి సూచించారు. ఒకవేళ ఇంకా ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అలాగే తాను కూడా రెవెన్యూ డివిజనల్ పరిధిలోని మండలంలో ఏదో ఒక సచివాలయం వద్దకు వెళతానని, అక్కడ రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మాతో పాటు కలెక్టరు, జాయింట్ కలెక్టరు కూడా వారానికి రెండురోజులు ఏదో ఒక మండలానికి వెళ్లి అక్కడున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది ఎప్పుడయితే క్షేత్రస్థాయికి వెళతారో వారి సమస్యలు తెలుసుకుని ఆ సమ్యస్యల పూర్తికి వీలుంటుందన్నారు. రైతులు సచివాలయాలకు వచ్చేటప్పుడు సరైన ధ్రువపత్రాలతో రావాలన్నారు. అప్పుడే వారికి న్యాయం జరుగుతుందన్నారు.



వల్లూరులో రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ అన్నారు. వీరి వెంట తహసీల్దారు శ్రీవాణితో పాటు రెవెన్యూ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల అమలుకు ప్రజలు సహకరించాలి



బి.వి ప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, పులివెందుల

ఫటాఫట్

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనల అమలుకు ప్రజలు సహకరించాలని పులివెందుల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ ప్రసాద్ పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూలో ఆయన వివరాలు తెలిపారు.

ప్రశ్న: వాహనాల తనిఖీల్లో ఎక్కువగా పోలీసులే కనిపిస్తుంటారు ?

జవాబు: నేను నా సిబ్బందితో వాహనాలను తనిఖీలు చేస్తుంటాం. అయితే ప్రతి చిన్నవాటికి వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల వాహనదారులు, ర్యాష్ డ్రైవింగ్, యువత పోలీసులకు మాట వినే పరిస్థితి ఉంటుంది.

ప్రశ్న: జరిమానాల విషయంలో ఎంవీఐకి, పోలీసులకు తేడా ఏమిటి?

జవాబు: జరిమానా విషయంలో నాకు భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది. ఒకే వాహనం మూడవసారి పట్టుబడితే సీజ్ అవుతుంది. పోలీసులు అయితే వార్నింగ్ ఇస్తారు. వాహనదారుడి చేష్టలు బట్టి జరిమానా, స్టేషన్‌కు తరలింపు ఉంటుంది.

ప్రశ్న: వాహనాలకు జరిమానాలు ఏ విధంగా ఉన్నాయి?

జవాబు: డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే రూ.5వేలు, హెల్మెట్ లేకుంటే రూ.1000, ఓవర్‌స్పీడ్ రూ.1000, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రూ. 1500, ట్రిపుల్‌రైడింగ్ చేస్తే రూ.1500, ఓవర్ లోడ్‌కు టన్నుకు రూ.2000 విధిస్తున్నాం. సీట్ బెల్ట్ ధరించని వారికి, గూడ్స్ వెహికల్స్‌లో ప్రజలను తరలించడం, లోడువేసుకొని వెళ్లే వాహనాలపై కూర్చొని ప్రయాణాలు సాగించే వాహనాలకు కూడా జరిమానా విధిస్తున్నాం. ఒక్క జనవరి మాసంలోనే రూ.13,41,621 జరిమానాలు విధించాం.

ప్రశ్న: ఫిట్‌నెస్ లేని వాహనాలు రోడ్లపై తిరుగుతున్నాయి.. మీరేమంటారు?

జవాబు: ఆర్టీసీ, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు, ప్రైవేట్ పాఠశాలలు తదితర ప్రాంతాలకు వెళ్లి తనిఖీలు చేస్తుంటాం. ఫిట్‌నెస్‌లేని వాహనాలను సీజ్ చేస్తున్నాం.

ప్రశ్న: పలుకుబడిగల వారి వాహనాలను చూడకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ మంజూరు చేస్తుంటారనే ఆరోపణలున్నాయి.

జవాబు: రవాణాశాఖకు సంబంధించిన యాప్‌లో వాహనానికి సంబంధించిన వివరాల నమోదు, వాహనం ఫోటో తీయాల్సి ఉంటుంది. ఆ యాప్ ఓపెన్ అయిన లొకేషన్ నుంచి వంద మీటర్ల పరిధి వరకు చూపుతుంది.చూడకుండా ఎఫ్‌సీ మంజూరు అనేది జరగదు.

ప్రశ్న: విద్యుత్ వాహనాలకు ఎలాంటి నిబంధనలు ఉంటాయి?

జవాబు:విద్యుత్ వాహనాలకు ప్రభుత్వం ట్యాక్స్ ఎక్జంప్షన్ మాత్రమే ఇస్తుంది. కొంతమంది విద్యుత్ వాహనాలకు లైసెన్స్ అవసరం లేదని దుష్ప్రచారం చేస్తున్నారు. వాహనం ఏదైనా వాహనదారుడికి లైసెన్స్ ఉండాల్సిందే?

ప్రశ్న: ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటిస్తే సరిపోతుందా? ప్రయాణ సౌకర్యం బాగుండాలి కదా? ఈ బాధ్యత ఎవరిపై ఉంటుందంటారు.

జవాబు: వాహనదారుడికి సూచిక బోర్డులపై అవగాహన ఉంటేనే లైసెన్స్‌లు మంజూరు చేస్తాం. మా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తున్నాం.

ప్రశ్న: పలుకుబడిగల వ్యక్తుల వాహనాలు పట్టుబడినప్పుడు ఒత్తిళ్లను ఎదుర్కొంటారా?

జవాబు: కొన్నిసార్లు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుకుంటాం.

ప్రశ్న:వాహనదారులకు మీరిచ్చే సలహా?

జవాబు: మీ కుటుంబాన్ని, మీపై ఆధారపడ్డ వారిని గుర్తించుకోవాలి. నిబంధనలు తప్పక పాటించాలి.

అందరూ కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: సీఐ

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మీ పరిసరాల్లో.. మీ ఇంటి ఆవరణంలో స్థోమత ఉన్న వాళ్లు అందరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ రోషన్ తెలిపారు. మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు... కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచనల మేరకు సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆటో ద్వారా కమలాపురం మండల ప్రజలకు దొంగతనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో జిల్లాలోని పలుచోట్ల దొం గతనాలు ఎక్కువయ్యాయన్నారు. కావున ప్రజలు బంగారు ఆబరణాలు, డబ్బు తదితర వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. పొ లం పనులు, వాకింగ్, పశువులు మేపుకోవడానికి వెళ్లే మహిళలు బం గారు ఆభరణాలను ధరించకుండా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఒకవేళ బంగారు ఆభరణాలు ధరిస్తే అవి బయటికి కనిపించకుండా ఉం డే విధంగా జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. కమలాపురం ఎస్ఐ 9121100 52532 కు కమలాపురం సీఐ 9121100529కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఉయ్యాలవాడ వర్ధంతి సభను విజయవంతం చేయండి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కడప నగర ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 22న శనివారం ఉదయం 10గంటలకు రాయలసీమ తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభ జరగనున్నట్లు ఆర్పీపీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభను విజయవంతం చేయాలన్నారు.

నేడు పొలతలలో మహాశివరాత్రి ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ బుధవారం పొలతల క్షేత్రంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కృష్ణా నాయక్ తెలిపారు. కావున అధికారులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు





ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా దేవి... రాహుకాల దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కడప కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కడప బిల్టప్ సర్కిల్‌లో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున పంచామృతాభిషేకం అనంతరం అమ్మవారిని అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు అనంతరం మధ్యా హ్నాం3 నుంచి 4.30 వరకు రాహుకాల పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 26న ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఉంటుందని ఆలయ వ్యవస్థాపకుడు సుధా మల్లిఖార్జునరావు, నిర్వాహకులు సుధా దుర్గాప్రసాద్ తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

మైనార్టీల పక్షపాతి చంద్రబాబు : టీడీపీ

కడప(వినాయకనగర్), ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజమ్‌లకు వేతనాలు రూ.45 కోట్లు విడుదల చేసి రంజాన్ తోఫాను కొనసాగిస్తున్న సీఎం చంద్రబాబు మైనార్టీల పక్షపాతి అని మాజీ డిప్యూటీ ఆరీఫుల్లా అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

గౌరవ వేతనం పెంచడం అభినందనీయం

కడప నాగరాజుపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇమామ్ మౌజమ్‌ల గౌరవ వేతనం పెంచడం అభినందనీయమని టీడీపీ మైనార్టీ నాయకులు అన్నారు. మంగళవారం నగరంలోని 27వ డివిజన్ గౌస్ నగర్‌లో టీడీపీ ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకులు అమానుల్లా షేక్ లయన్ పటాన్, ఖాదర్‌బాష, స్థానిక టీడీపీ అభిమానులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. వల్లి, అల్లాబకాష్ పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఈదురుబాషా

సికెదిన్నె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని యాంటీహ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ ఈదురు బాషా తెలిపారు. చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగంవారితో కలిసి చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో జరుగుతున్న విషయాలపట్ల అవగాహన పెంచుకోవాలని, చెడుకు దూరంగా ఉండాలన్నారు. హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి తోడ్పాటు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):అభి చారిటబుల్ ట్రస్టు సభ్యులు అనాథ వృద్ధుడికి సాయం అందించారు. వివరాలిలా... కమలాపురం నగర పంచాయతీలోని ఆర్ఎస్ రోడ్డు వడ్లమిషను వీధిలో ఒక వ్యక్తికి భిక్షాటన చేసుకుంటూ కాల్వపై పడడంతో తలకు గాయాలయ్యాయి. అక్కడున్న అభి చారిటబుల్ ట్రస్టు సభ్యుడు లక్ష్మణ్, రాములు ఫోను ద్వారా అభి ట్రస్టు చైర్మన్ ఎన్.విజయబాబుకు విషయం తెలుపగా అక్కడికి వెళ్లి కమలాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డికి విషయం తెలిపారు. వెంటనే 108కు సమాచారం ఇచ్చి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రీ సర్వే పక్కాగా చేపట్టండి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామాల పరిధిలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రీసర్వేను పక్కాగా చేపట్టాలని డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ తెలిపారు. కొండూరు గ్రామ రెవెన్యూ పొలంలో మంగళవారం రీసర్వే జరుగుతున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు.

సామర్థ్యాన్ని పెంపొందించడం కోసమే శిక్షణ

వేంపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ విద్య ప్రణాళికను అమలు చేయడంలో వారి సామర్థ్యాన్ని పెంపొందించడం కోసమే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ సునీత తెలిపారు. మంగళవారం వేంపల్లె జడ్పీ బాలుర హైస్కూల్‌లో అంగన్వాడీ వర్కర్లకు మహిళా శిశు సంక్షేమశాఖ, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ అంగన్వాడీ పిల్లల అభివృద్ధి, ప్రారంభ సంవత్సరం ప్రాముఖ్యతను జాతీయ విద్యా విధానం 2020 తెలియజేశారు. 85శాతం మెదడు అభివృద్ధి మొదటి ఆరు సంవత్సరాలలో జరుగుతుందన్నారు. వయసుకు దగ్గ ఈసీసీఈ ప్రీస్కూల్ కృత్యాలు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అందించిన ప్రీస్కూల్ కిట్లను ఉపయోగించడం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ విస్తరణాధికారిణి డాక్టర్ స్వర్ణలత, నాగరత్న, ఎంఈఓ స్టాలిన్, ప్రధానోపాధ్యాయులు డీఆర్పీలు ప్రతాప్‌రెడ్డి, రాజు, దస్తగిరి పాల్గొన్నారు.

చిరుతపులుల జాడ కోసం ట్రాక్ కెమెరా ఏర్పాటు

లింగాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలంలో కొద్దిరోజులుగా చిరుత పులుల సచారం అందరిలోను ఆందోళన రేకెత్తుండడంతో వాటి జాడను గుర్తించేందుకు పొలాల్లో ట్రాక్ కెమెరాలను అటవీశాఖ వారు ఏర్పాటుచేస్తున్నారు. లింగాలలో వాసుదేవరెడ్డి, కామసముద్రంలో లక్ష్మీనారాయణ పొలాల్లో మంగళవారం అటవీశాఖ బీట్ ఆఫీసర్లు గోపాలకృష్ణ, మహబూబ్ బాష కెమెరాలను ఏర్పాటుచేశారు.

పాపాఘ్ని నదిని కబ్జా చేస్తున్నారు... చర్యలు తీసుకోండి



కబ్జా చేసిన ప్రాంతాన్ని చూపుతున్న మాజీ చైర్మన్ ఎద్దల కొండ్రాయుడు తదితరులు

వేంపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సమీపంలోని ఎద్దలకొండ సమీపంలోని పాపాఘ్నిని కబ్జాచేస్తున్నారు. కంచె వేస్తున్నారు. దేవుని తిరుణాళ్ల జరిగితే అడ్డంకిగా మారుతుందని దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దల కొండ్రాయుడు, మాజీ సభ్యులు పివి రమణ, అలిరెడ్డిపల్లె బాల కృష్ణారెడ్డిలు పేర్కొనారు. వృషభాచలేశ్వరస్వామి కొలువైన కొండ కింద భాగంలో పాపాఘ్నిలో కంచెవేయడంతో వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతారని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. పాపాఘ్ని నదిని కబ్జా చేసి సాగుచేసుకోవడం పరిపాటిగా మారిందని, ఇలాంటి వాటిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

ద్వారకనగర్‌కు శ్మశానం ఏర్పాటు

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెర్లోపల్లె పంచాయతీ ద్వారకనగర్‌కు శ్మశానం ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ గంగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పుత్రా క్రిష్ణ చైతన్యరెడ్డి చొరవతో పగడాలపల్లె సర్వేనెంబరు 176 నందు ఎకరా 50 సెంట్లు కేటాయించామన్నారు.

బలసింగాయపల్లెలో 'గ్రామదర్శిని'

చెన్నూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బలసింగాయపల్లె గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు తహసీల్దారు సరస్వతి ఆధ్వర్యంలో గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారుతో పాటు రెవెన్యూ సిబ్బంది సచివాలయానికి వచ్చిన ప్రజలతోనూ, ఆ గ్రామ ప్రజలసమస్యలు తెలుసుకున్నారు. ఆర్ఐ కౌశిక్, వీఆర్వో వినోద్‌బాబు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'దొంగతనాలను అరికట్టాలి'

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధి రామరాజుపల్లె 48వ డివిజన్‌లో దొంగతనాలను అరికట్టాలని కడప తాలూకా జోన్ సీపీఐ నాయకుడు కె.మునెయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రామరాజుపల్లె తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల రోజులలో రామరాజుపల్లె ఓసీ కాలనీలో రెండు పొట్టేళ్లను దొంగలించారన్నారు. అలాగే సోమవారం రాత్రి చలపతి అనే వ్యక్తి స్కూటీ దొంగలించారన్నారు.

20 సూత్రాల ద్వారా సంక్షేమం, అభివృద్ధి

● తులసిరెడ్డిని కలిసిన 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్

వేంపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 20 సూత్రాల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు కృషిచేస్తున్నట్లు 20సూత్రాల చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. వేంపల్లెలో మంగళవారం ఆయన వేంపల్లెకు వచ్చారు. స్థానిక బీజేపీ నాయకులు జిల్లా కార్యదర్శి గాలి హరిప్రసాద్, దొంతు సుమన్ తదితరులు కలిసి సత్కరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డిని దినకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కాసేపు మాట్లాడుకున్నారు. అనంతరం దినకర్‌బాబు విలేకరులతో మాట్లాడారు. మొదటి నుంచి తులసిరెడ్డి మంచి మిత్రుడని, అందుకే కలిసినట్లు తెలిపారు. 20సూత్రాల అమలుకు సంబంధించి తగు సూచనలు, సలహాలు తీసుకుననట్లు తెలిపారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కూటమి సర్కారు హామీల అమలులో విఫలమైందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి ధ్వజమెత్తారు. మంగళవారం రాష్ట్ర పీసీసీ కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద విజయజ్యోతి ఆధ్వర్యంలో వినూత్నంగా ప్లేట్లతో శబ్దం చేస్తూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 8 నెలల కూటమి సర్కారు పాలనో ఉచిత గ్యాస్ పథకం, సంక్షేమ పెన్షన్లు తప్ప, సూపర్ సిక్స్ పథకాల ఊసేలేదన్నారు. నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడం లేదన్నారు. విద్యార్థులకు ఏటా రూ.15 వేల ఆర్థిక సాయమేదని ప్రశ్నించారు. ప్రతి ఏటా రైతులకురూ. 30వేల సాయమేదని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఎక్కడని ప్రశ్నించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):మహిళా దినోత్స వం సందర్భంగా వివేకానంద ఫౌండేషన్ సంస్థ మహిళా ధాత్రి పురస్కారాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈనెల 28 వరకు గడువు ఉందన్నారు.

జూదరుల అరెస్టు

కడప(క్రైం), ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గుర్రాలగడ్డ వద్ద మంగళవారం జూదం ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరక ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి సిబ్బందితో జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 15850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వృథాగా పోతున్న తెలుగు'గంగ'..!

● పాడైన హెడ్ రెగ్యులేటర్ గేట్లు ● పూడిన ఉప కాలువలు ● ఏళ్ల తరబడి ఇదే దుస్థితి

దువ్వూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కల్పతరువు, రైతులు సాగు చేసే పంటలకు ఆయువు, భూగర్భజలాల ఉత్పత్తికి ప్రధాన వనరు తెలుగుగంగ జలాలు. 98వ కిలోమీటరు వద్ద నుంచి ప్రధాన కాలువ వెంబడి ప్రవేశించి దువ్వూరు మండలంలో 108 కిలోమీటరు వద్ద సబ్సిడరీ రిజర్వాయర్-1 లోకి తెలుగుగంగ నీరు ప్రవేశిస్తుంది. ఇక్కడ స్టోరేజీ అయిన నీరు హెడ్ రెగ్యులరేటర్ ద్వారా చెన్నముక్కపల్లె కాలువ దిగువన పొలాలకు సాగునీరు అందుతోంది. రిజర్వాయర్-1లో ఎడమవైపు నుంచి ప్రధాన కాలువ గుండా ఎస్ఆర్-2లోకి ప్రవేశించి తదనంతరం బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ నింపడం ఆనవాయితీగా జరుగుతోంది. ఎటొచ్చి ఎస్ఆర్-1లో హెడ్‌రెగ్యులేటర్ గేట్లు పాడై ప్రతి ఏటా నీరు వృథాగా పోతోంది. ఈ దుస్థితి 15 ఏళ్లుగా కొనసాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆయకట్టుకు నీరు అందించే ఉప కాలువలు పూడిపోయాయి.

● సబ్సిడరీ రిజర్వాయర్-1లో హెడ్‌రెగ్యులేటర్‌కు ఏర్పరచిన గేట్లు పాడై 15 ఏళ్లకుపైగా అయింది. అప్పటి నుంచి ఏటా నీరు వస్తున్నా దిగువకు వృథాగా పోవడం, విలువైన గంగ జలాలు నిరుపయోగం అవుతున్నాయనే విషయం అధికారులందరికీ తెలిసిందే. దిగువన కాలువల ద్వారా వెళుతున్న నీరు పొలాలకు అందడంలేదు. ఉపకాలువలు, చెట్లతో, మొక్కలతో పూడిపోయి వాటి ఆనవాళ్లు కనిపించడంలేదు. దీంతో బోర్ల ద్వారా, ఇంజన్లు వేసుకుని నీటిని పొలాలకు అందిస్తున్నారు. ఎస్ఆర్-1లో 1.8 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం ఉంది. హెడ్‌రెగ్యులేటర్ గేట్ల మరమ్మతులు చేపట్టి నిలువ సామర్థ్యాన్ని మరింత పెంచాలనే లక్ష్యాన్ని ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ వ్యక్తపరుస్తున్నా ఆదిశగా అడుగులు వేస్తారో లేదోనని రైతులు ఎదురుచూస్తున్నారు. కొన్నేళ్లుగా జరుగుతున్న నీటి వృథాను అరికట్టాలని ఆయకట్టు రైతులు వేడుకుంటున్నారు.




చల్లబసాయిపల్లె వద్ద పూడిపోయిన గంగ ఉప కాలువ

ఏటా రెండు పంటలు పండిస్తున్నాం



తెలుగుగంగ నీటితో ఏటా రెండు పంటలు పండిస్తున్నాం. ప్రస్తుతం సజ్జ, మొక్కజొన్న పంటలు సాగు చేశాను. ఉప కాలువలు సరిగా లేకపోవడంతో విద్యుత్తు మోటార్లు, ఇంజన్ల ద్వారా పంటలకు నీటి తడులు అందిస్తున్నాం. ఉప కాలువలు ఏర్పరిచేందుకు రైతులు ఒకరికొకరు సహకరించుకోవడంలేదు.

ఎం.నారాయణరెడ్డి, రైతు, గుడిపాడు.



సబ్సిడరీ రిజర్వాయర్-1లో ఉన్న నీరు

నేడు బీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

కాశినాయన ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం నర్సాపురం ఎంపీడీవో కార్యాలంయలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మైథిలీరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 10.30గం నుంచి సాయంత్రం వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ ఆన్‌లైన్ అప్లికేషన్,కుల ఆదాయ ధ్రువీకరణపత్రం,రేషన్‌కార్డు,ఆధార్‌కార్డు, బ్యాక్ అకౌంట్, విద్యార్హతలు ఒరిజినల్ రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు.

పోరుమామిళ్ల..: ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు బుధవారం ఉదయం 10.30కు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు సమయంలో పేర్కొన్న సర్టిఫికెట్లన్నీ రెండు జతల జిరాక్స్‌కాపీలను కూడా తెచ్చుకోవాలన్నారు.

22న సర్వసభ్య సమావేశం

మైలవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22వ తేదీ శనివారం మైలవరం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామచంద్రారెడ్డి మంగలవారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల మండల అధికారులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అర్జీలు పరిశీలించి విచారించి వారికి న్యాయం జరిగేలా చూడాలని ఆర్డీవో చంద్రమోహన్ ఆదేశించారు. మంగళవారం ఆయన పోరుమామిళ్ల మండలంలోని నర్సింగపల్లె పొలాలు, రంగసముద్రం జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన రోడ్డును పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జ్ఞానలింగేశ్వరస్వామి వార్షిక వేడుకలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్ట వీధి జ్ఞానలింగేశ్వరస్వామి 13వ వార్షికవేడుకలు ఆలయంలో భక్తులు, నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో భక్తులు, విశేషంగా పాల్గొని పూజలు చేసి మొక్కుకున్నారు. అందులో భాగంగా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఆలయాన్ని సందర్శించి పూజలు చేసి మొక్కుకున్నారు. వైసీపీ పట్టణాధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, గూడెం చెరువు నాగేశ్వరరెడ్డి, గిరిధర్‌రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వండి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : దాదాపు 40సంవత్సరాల నుంచి 1001 సర్వేనెంబరులో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నామని, తమకు కుళాయిలు కూడా ఏర్పాటు చేశారని గతంలో ఇదే సర్వేనెంబరులో 18 మందికి ఇంటిపట్టాలు మంజూరు చేశారని, మిగలిన 25 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని ఎరుకల కులానికి చెందిన వారు ఆర్డీవో వాహనానికి అడ్డుగా నిలబడి విన్నవించారు. మంగళవారం తహసీల్దారు ప్రజావేదికలో వచ్చిన అర్జీలు విచారించేందుకు పోరుమామిళ్లకు రాగా వీరు ఆయనకు తమ సమస్యలు విన్నవించుకుని న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు. ఒకానొక సమయంలో కాళ్లమీద పడి వేడుకునే ప్రయత్నాలు చేయగా, ఆయన వీటిపై విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆప్కాస్‌ను కొనసాగించాలి

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కార్మికుల భద్రత కోసం ఆప్కాస్‌ను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు ఆప్కాస్‌ను కొనసాగించాలని కోరుతూ భగత్‌సింగ్ కాలనీ నుంచి తహసీల్దారుకార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, పశువైద్య కళాశాల యూనియన్ నేతలు ఆర్‌వీ సుబ్బారావు, డీవీ రమణ, చిన్న ఓబులేసు, కుమార్ గోపాల్‌దస్తగిరి , సుజాత, యూటీఎఫ్ నేతలు రవీంద్రుడు, జేవీవీ సురేష్ , మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చంటి, కార్యదర్శి సాల్మన్ పాల్గొన్నారు.

సచివాలయం, అంగన్వాడీల పరిశీలన

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపవరం గ్రామంలో ఉన్న సచివాలయం, అంగన్వాడీ కేంద్రాలను మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చల పుల్లయ్య సందర్శించారు. మంగళవారం సచివాలయంలోని అధికారులతో ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి వినతులకు తగిన పరిష్కారం చూపే దిశగా పనిచేయాలన్నారు. తదనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వం ద్వారా పిల్లలకు అందించే పౌష్టికాహారాలు ఏమేరకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో పలు ప్రశ్నలు వేసి ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మణ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం ప్రగతికి సోపానం

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : పచ్చదనం ప్రగతికి సోపానమని టీడీపీ పట్టణాధ్యక్షుడు దాసరిబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ యాపరాల చిన్న అన్నారు. మంగళవారం ప్రొద్దుటూరు రోడ్డులోని డివైడర్‌లో పూల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి,బండి అమర్ నాథ్, తుపాకుల రమణ మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం ,ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) :బ్రహ్మంగారిమఠం మండలంలోని ఎర్రపల్లిలో మంగళవారం శ్రీరామ చంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి,వేయిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పుట్టా ప్రభాకర్ యాదవ్,మిల్లుశ్రీను, యస్ఆర్ శ్రీనివాసుల రెడ్డి,వెంకటేశ్వర్లు, నాగరాజు శర్మ,కానాల మల్లికార్జున్‌రెడ్డి, కొర్రపాటి ప్రభాకర్,లగసాని వీరయ్య, నాగరాజు,గంగరాజు పాల్గొన్నారు.

రైతులకు పంటసాగుపై అవగాహన కల్పిస్తున్నాం

వెంకటకృష్ణారెడ్డి, ఏవో



ముఖాముఖి

ముద్దనూరు ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి):మండలంలోని రైతులకు సీజన్‌కు సంబంధించి పంటసాగు పై అవగాహన కల్పిస్తున్నారు.రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రభుత్వ పథకాలను రైతులకు తెలియజేస్తున్నారు.రైతులు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేస్తున్నారు.రైతులకు ఎటువంటి సమస్య ఉన్నా తమ వద్దకు వస్తే తక్షణమే పరిష్కరిస్తామంటున్న వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డితో ఇంటర్వ్యూ...

ప్రశ్న:మండలంలో ఎన్ని రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి?

జవాబు: 12 రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి.

ప్రశ్న:మండలంలో సాగునీటి ఆయకట్టు విస్తీర్ణం ఎంత?

జవాబు:మండలంలో ఖరీఫ్ సీజన్‌లో నీటి ఆధారంగా 8292ఎకరాలు, రబీ సీజన్‌లో 3170ఎకరాల్లో పంట సాగుచేస్తారు.

ప్రశ్న: రైతులకు బీమా సౌకర్యం అవగాహన కల్పన పై కామెంట్

జవాబు:రబీలో ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకం గురించి సమాచార గ్రూపుల ద్వారా, గ్రామాల్లో చాటింపు ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: ప్రస్తుతం ఏయే పంటలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నారు?

జవాబు:శనగ, మినుము, జొన్న, ప్రొద్దుతిరుగుడు, నువ్వులు.

ప్రశ్న: రైతుసేవా కేంద్రాల్లో సిబ్బంది పనితీరు ఎలా ఉంది?

జవాబు: రైతుసేవా కేంద్రాల్లో సిబ్బంది నిత్యం రైతుకు అందుబాటులో ఉన్నారు.

ప్రశ్న: పొలం పిలుస్తోంది కార్యక్రమం పై రైతుల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది?

జవాబు:ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా వారంలో రెండు రోజులు మంగళ, బుధవారం గ్రామాల్లో రైతులతో కలిసి సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్నాం. పంట సస్యరక్షణకు, అధిక దిగుబడులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాము.

ప్రశ్న: మండలంలో కందుల కొనుగోళ్ళు ఎక్కడ జరుగుతుంది?

జవాబు:మండల కేంద్రంలో డీఎం మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోళ్లు చేస్తారు.ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల మండలాల రైతులు ఇక్కడే విక్రయించవచ్చు.

అమెరికా దుశ్చర్య అమానుషం

బద్వేలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అమెరికా నుంచి వందలాదిమంది భారతీయులను బహిష్కరించి యుద్ధ విమానాలలో తీసుకురావడం అమానుషమని దీనిని డీవైఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్ని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఖండిస్తూ మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహం సర్కిల్ వద్ద నిరసన తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులను చేతులు, కాళ్లకు సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీల్లగా చూడడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ , సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వెంకటయ్య నగర్‌లో మున్సిపల్ కమిషనర్ పర్యటన

బద్వేలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటయ్యనగర్‌లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తన సిబ్బందితో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ వీధిలో అనుమతి లేకుండా కట్టే కట్టడాలను నిలుపుదల చేయడం జరిగింది. అలాగే సర్వేయర్ పరిశీలించిన అనంతరం నిర్మాణాలు చేపట్టాలని, సందు రస్తాలను ఆక్రమించి డ్రైనేజీ కాలువలు, మరుగుదొడ్లు వంటి కట్టడాలను పరిశీలించారు. రోడ్డుపై ఇంటి తాపలు కట్టిన ఆయా గృహ యజ మానులు వాటిని స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ఇంకా పలు రకాల సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్, వార్డు కౌన్సిలర్ రవితేజ, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు రూరల్ స్టేషన్ పరిధిలో ముగ్గురు మట్కా బీటర్లను వేరువేరుగా అరెస్టు చేశారు. వీరివద్దనుంచి మట్కా స్లిప్పులతో పాటు 25 వేల నగదుస్వాధీనం చేసుకున్నారు. అరెస్టు కాబడిన మట్కా బీటర్లలో కొత్తపల్లె పంచాయితీ ఆటో నగర్‌కు చెందిన నవీన్, కల్లూరు గ్రామా నికి చెందిన షరీఫ్, చాపాడుమండలం అనంతపురం గ్రామానికి చెందిన గంగయ్య వున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలు పెంచాలని పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. మంగళవారం 16వ రోజు నిరసనలో భాగంగా విద్యార్థులు కళాశాల ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరవధిక సమ్మె చేపట్టారు.

చెరువు గండిని పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



గండిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ బ్రాంచ్ ఏఈఈ వెంకటసుబ్బయ్య

ముద్దనూరు ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి):ముద్దనూరు సమీపంలో జమ్మలమడుగు రోడ్డులోని కొండ కింద ఉన్న చెరువుకు పడిన గండిని మంగళవారం ఇరిగేషన్ అధికారి వెంకటసుబ్బయ్య పరిశీలించారు. నాలుగు సంవత్సరాల క్రితం ముద్దనూరు చెరువుకు గండి పడింది. దీంతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఫిబ్రవరి 17 వ తేదీన చెరువు మట్టి తవ్వేస్తున్నారు,చెరువు కట్టకు పొంచి ఉన్న ప్రమాదం అనే కథనం ప్రచురించడం జరిగింది.దీనికి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించారు.ఇరిగేషన్ బ్రాంచ్ ఏఈ వెంకటసుబ్బయ్య చెరువు గండి పరిశీలించి రివిట్‌మెంట్, జంగిల్ క్లియరెన్స్, గండి పూడ్చేందుకు దాదాపు రూ.15లక్షలు అంచనా వేసి, ట్రిబులార్ కింద ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని తెలిపారు. చెరువు మట్టి అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటుమని తహసీల్దారు కిశోర్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు.

వరిలో జింక్ లోపాన్ని నివారించుకోవాలి


ఖాజీపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు వరిలో జింక్ లోపాన్ని నివారించుకోవాలని కేవీకే శాస్త్రవేత్తలు సాయిమహేశ్వరి, శశికళ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చెముళ్లపల్లె పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరిపంటలో జింకు లోపాన్ని నివారించుకునేందుకు లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్, 5 గ్రాముల యూరియా కలిపి వారంలో మూడుసార్లు పిచికారీ చేయాలన్నారు. అలాగే నువ్వుల పంటలో కాండం, ఎండుతెగుళ్లు ఉందని, అది నివారించేందుకు మ్యాంగోజబ్ లేదా కాపర్‌ఆక్సిక్లోరైడ్ లీటరు నీటికి మూడు గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగార్జున, సిబ్బంది వెంకటకుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతోకూడిన విద్యను అందించాలి

కాశినాయన,ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి):అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతోకూడి విద్యను అందించాలని ఎంఈవో నిర్మల,జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నిత్యానందరాజు పేర్కొన్నారు.మంగళవారం నర్సాపురంలోని మోడల్ స్కూల్లో జ్ఞానజ్యోతి కార్యక్రమం కింద అంగన్వాడీ టీచర్లకు చేపట్టిన 6 రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులను వారు ప్రారంభించారు. ఈకార్యక్రంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య,డీఆర్పీలు రామక్రిష్టారెడ్డి,రవి,చంద్రశేఖర్,వసంతకుమార్, సెక్టోరల్ అధికారులు విజయభాస్కర్,విశ్వనాథ్‌రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: అంగన్వాడీ చిన్నారుల్లో సామర్థ్యాలను పెంచడానికి అంగన్వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సావిత్రమ్మ తెలిపారు. మంగళవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో 18 నుంచి 28వ తేదీ వరకు అంగన్వాడీ అర్బన్, రూరల్ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సావిత్రమ్మ, సీడీపీవో హైమావతి, అరుణకుమారి, సూపర్‌వైజర్లు, ఆర్పీలు నాగేంద్ర, శాంతకుమారి, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తాం



ర్యాలీ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆ బ్యాంకు డివిజనల్ మేనేజర్ విలియం, సీనియర్ మేనేజర్ అరుణ్ ఘోస్ తెలిపారు. మంగళవారం జిన్నారోడ్డుపై కెనరా బ్యాంకు వద్ద నుంచి మైదుకూరు రోడ్డు, శివాలయం సెంటర్, రాజీవ్ సర్కిల్ మీదుగా వివేకానంద క్లాత్ మార్కెట్‌లోని కెనరా బ్యాంకు వరకు బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న సేవలు గురించి ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఖాతాదారులకు ఉచిత క్యాన్సర్ చికిత్సలకు సహాయం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారోడ్డు బ్యాంకు చీఫ్ మేనేజర్ ప్రభు, సీనియర్ మేనేజర్ ప్రదీప్‌కుమార్, మెయిన్‌బ్రాంచ్ చీఫ్ మేనేజర్ శరవణన్, గాంధీరోడ్డు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పద్మావతి, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేలు జాతి పశువులతో రైతు ఆదాయం రెట్టింపు

కాశినాయన, ఫిబ్రవరి18(ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు జాతి పశువులతో ఆదాయం రెట్టింపు అవుతుందని మండల పశువైద్యుడు రామారావు పేర్కొన్నారు.మంగళవారం రెడ్డికొట్టాల గ్రామంలో జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శనను ఏర్పాటుచేశారు. ఈప్రదర్శనలో పాల్గొన్న కృత్రిమ గర్భధారణద్వారా పుట్టిన లేగదూడలకు ప్రథమ ,ద్వితీయ బహుమతులు అందజేయడంతోపాటు ఇతర దూడల రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈకార్యక్రమంలో టేకూరుపేట పశువైద్యుడు శివశ్రీనివాసులరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ హెల్మెటు ధరించి రక్షణ పొందాలని, అతివేగం ప్రమాదానికి మూలమని ఎస్ఐ కొండారెడ్డి అన్నారు. మంగళవారం ప్రమాదాలు నివారించేందుకు పోరుమామిళ్లలోని మల్లకతవ వద్ద ఆర్టీసీ బస్టాండు, అంబేడ్కర్ సర్కిల్, సీతారాంపురం క్రాస్‌రోడ్డు వద్ద డిగ్రీకళాశాల వద్ద మైదుకూరు రోడ్డులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గురుమోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్ ఇండియా జంప్‌రోప్‌లో ముబారక్‌కు తృతీయ స్థానం



మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇంటియా జంప్ రోప్‌లో మైదుకూరు హైస్కూల్ విద్యార్థి ముబారక్‌కు తృతీయ స్థానం లభించిందని హెడ్ మాస్టర్ రామ్మోహన్ మంగళవారం తెలిపారు. రామ్మోహన్ మాట్లాడుతూ 2024-2025 ఆల్ ఇండియా జంప్ రోప్ పోటీలు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మహారాష్ట్ర రాష్ట్రం నాసిక్‌లో జరిగాయి.ఈ కార్యక్రమంలో పట్టణంలోని బాలుర పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ముబారక్ పోటీలో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచాడని తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ వినోదిని,చంద్రావతి తదితరులు ముబారక్‌ను అభినందించారు.